సాక్షి
నంద్యాల
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025




శ్రీమఠంలో ఏపీఈఆర్‌సీ చైర్మన్

మంత్రాలయం: శ్రీమఠంలోని రాఘవేంద్ర స్వామి మూలబృందావనాన్ని బుధవారం ట్రాన్స్‌కో ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ రామ్‌సింగ్ దర్శించుకున్నారు. ఆయన వెంట ఎస్ఈ ఉమాపతి ఉన్నారు.



బాబోయ్.. బర్డ్‌ఫ్లూ!

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాపించింది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోనూ చికెన్ విక్రయాలు పడిపోయాయి. పలు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,613.33
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 44.575
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 6,687

న్యూస్‌రీల్

శ్రీశైలం జలాశయంలోకి నీటి మళ్లింపు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం దిగువ భాగంలో ఉన్న 5,209 క్యూసెక్కుల నీటిని మంగళవారం నుంచి బుధవారం వరకు జలాశయంలోకి మళ్లించారు. ఇందుకు ఎడమగట్టు కేంద్రంలో పంప్‌మోడ్ ఆపరేషన్ నిర్వహించారు. బుధవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 84.2894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 851.90 అడుగులకు చేరుకుంది.

పకడ్బందీగా 'పది' పరీక్షలు



మట్లాడుతున్న డీఆర్‌ఓ రాము నాయక్

నంద్యాల (న్యూటౌన్): జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను డీఆర్‌ఓ రాము నాయక్ ఆదేశించారు. బుధవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు ఉదయం 9–30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా 25,542 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరువుతున్నారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని 130 పరీక్ష కేంద్రాలకు 130 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 130 మంది శాఖాధికారులు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమిస్తామన్నారు.

శ్రీశైలంలో పనుల నాణ్యతపై విజి'లెన్స్'



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీశైలం టెంపుల్: కర్నూలు విజిలెన్స్ అధికారి డీఈ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు అధికారులు బుధవారం శ్రీశైలంలోని పనులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలు రెండు రోజుల పాటు చేయనున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గణేశ్ సదన్ ప్రహరీ చుట్టూ ఉన్న సీసీ రోడ్డు, నక్షత్రవనం, అటవీ సరిహద్దు రిటర్నింగ్ వాల్ పనుల్లో అవకతవకలు జరిగినట్లు కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో శ్రీశైలం చేరుకుని పనుల నాణ్యతను అధికారులు తనిఖీ చేశారు. ఆయా పనులకు చెల్లించిన బిల్లులు కూడా పరిశీలించారు.

పొదుపు మహిళలకు వ్యాపార అవకాశాలు



శిక్షణ పొందిన పొదుపు సంఘాల మహిళలతో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: పొదుపు సంఘాల్లోని మహిళలు వ్యాపారంగా ఎదగడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో పొదుపు మహిళలకు వివిధ చేతివృత్తులు, వ్యాపార నిర్వహణపై స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ.. పొదుపు సంఘ మహిళలు రుణ పరిమితిని పెంచుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎల్‌డీఎం రవీంద్రబాబు, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఐపీఎ ప్రసాద్, ఏసీ విజయగోపాల్ పాల్గొన్నారు.

20న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 20వ తేదీన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి నోటు ఉత్తర్వుల మేరకు ఈ సమావేశాలను స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని మినీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశాల్లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి – శిశు సంక్షేమం, పనులు – ఆర్థిక ప్రణాళిక తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు తమకు కేటాయించిన సమయానికి ఆయా స్థాయీ సంఘ సమావేశాలకు హాజరు కావాలని సీఈఓ కోరారు.



గడివేముల ఆదర్శపాఠశాలలో నాణ్యత లేని చికెన్‌ను పరిశీలిస్తున్న హెల్త్ సూపర్ వైజర్(ఫైల్)

- చికెన్ టెండర్లలో గోల్‌మాల్
- నిబంధనలు పక్కనపెట్టిన జాయింట్ కలెక్టర్
- అర్హత లేని కంపెనీకి అందలం
- హైకోర్టు స్టే ఇచ్చినా పట్టించుకోని అధికారులు
- ఈనెల 2న గడివేముల ఆదర్శ పాఠశాలలో..
- 9న బండిఆత్మకూరు కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు తీవ్ర అస్వస్థత



గడివేముల మోడల్ స్కూల్ హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

పచ్చపాతం.. ప్రాణసంకటం

అధికారులు నిబంధనలు పక్కనపెట్టి 'పచ్చ'పాతం చూపించారు. అర్హతలేని కంపెనీకి పాఠశాలలకు కిరాణా సరుకులు అందజేసే బాధ్యతలు అప్పగించారు. హైకోర్టు స్టే ఇచ్చినా అమలు చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. కస్తూర్బా, ఆదర్శపాఠశాలల్లో వరుసగా విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాలతో బయట పడ్డారు. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారుల్లో స్పందన కనిపించడం లేదు.

సాక్షి, నంద్యాల: జిల్లాలో 27 కస్తూర్బా బాలికల వసతి గృహాలు, 19 మోడల్ పాఠశాలలకు కిరాణా సరుకులు(ప్రొవిజన్స్), కూరగాయలు, గుడ్లు, పండ్లు, చికెన్‌లను సరఫరా చేయడం కోసం సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు గతేడాది డిసెంబర్ 21న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏడాదికి సంబంధించి ప్రొవిజన్స్‌కు రూ.6.43 కోట్లు, కూరగాయలు రూ.1.75 కోట్లు, ఫ్రూట్స్ రూ.96.49 లక్షలు, ఎగ్స్ రూ.96.49 లక్షలు, చికెన్ రూ.75.68 లక్షలుగా టెండర్‌లో పేర్కొన్నారు. ప్రొవిజన్స్ టెండర్ విషయంలో అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పూర్తిగా తలొగ్గి ఏకపక్షంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. ఎల్1గా నిలిచిన వారిని పక్కన పెట్టి తెలుగుదేశం నాయకుల ఆశీస్సులు పుష్కలంగా ఉన్న పులివెందులకు చెందిన శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్, ప్రొద్దుటూరుకు చెందిన కేవీఆర్ ఆగ్రోస్‌లకు అడ్డదారుల్లో టెండర్ కట్టబెట్టారు.

అర్హత లేని కంపెనీకి చికెన్ టెండర్

చికెన్ టెండర్ విషయంలో అక్రమాలకు జేసీ విష్ణుచరణ్ గేట్లెత్తేశారు. ఏడాదికి చికెన్ సరఫరా చేసేందుకు రూ.75.68 లక్షలతో పిలిచిన టెండర్‌ను ఏకపక్షంగా కేవీఆర్ ఆగ్రోస్‌కు కట్టబెట్టారు. కేవీఆర్ ఆగ్రోస్ సంస్థకు టెండర్‌లో పాల్గొనే అర్హతే లేదని.. అర్హత లేని సంస్థకు అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై జేసీ టెండర్ కట్టబెట్టినట్లు సమాచారం.

నాణ్యత లేని చికెన్ సరఫరాతో..

జిల్లాలోని 46 పాఠశాలలకు కేవీఆర్ ఆగ్రోస్ చికెన్ సరఫరా చేస్తోంది. అడ్డదారుల్లో టెండర్ దక్కించుకున్న కంపెనీ కావడంతో సరఫరాదారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. నాణ్యత లేని చికెన్ విద్యార్థుల ముఖం మీద కొడుతున్నారు. ఈ నెల 2వ తేదీ గడివేములలోని ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌లో చికెన్ తిని 10 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం మెనూలో పేర్కొన్న మేరకు స్కూల్ సిబ్బంది చికెన్ వడ్డించారు. అది తిన్న విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి గురయ్యారు. విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఈ విషయం బయటికి పొక్కింది.

అయినా తీరు మారలేదు..

నాణ్యత లేని చికెన్ తిని ప్రాణపాయస్థితికి చేరుకున్న విద్యార్థినులను చూసైనా అధికారులు నిద్రమత్తు వీడలేదు. ఘటనకు కారణమైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఇదే ఘటన పునరావృతమైంది. బండి ఆత్మకూరులోని కస్తూర్బా పాఠశాలలో ఈ నెల 9న చికెన్ తిన్న ముగ్గురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడడంతో 11వ తేదీ రాత్రి గుట్టుచప్పుడు కాకుండా పాఠశాల ప్రిన్సిపాల్ నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. తమ పిల్లల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

ప్రొవిజన్స్ టెండర్ విషయంలో జేసీ విష్ణుచరణ్ నిబంధనలు పాటించలేదనే కారణంతో ఎల్1గా నిలిచిన శ్రీ శ్రీనివాస ట్రేడర్స్ హైకోర్టును ఆశ్రయించింది. విచారించిన కోర్టు టెండర్లపై మధ్యంతర స్టే విధించింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ లోపు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించింది. కానీ, జిల్లా యంత్రాంగం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తోంది. హైకోర్టు ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తున్నారు. స్టే ఉన్నా యథావిధిగా పాత టెండర్ దారులతోనే పాఠశాలలకు ప్రొవిజన్స్ సరఫరా చేయిస్తున్నారు.

స్పందించని జేసీ, జీసీడీఓ

ఫుడ్ పాయిజన్ ఘటనపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జీసీడీఓ నాగసువర్చల కనీసం స్పందించలేదు. పది రోజుల వ్యవధిలో రెండు ఘటనలు చోటుచేసుకున్నా ఇప్పటి వరకు విచారణ చేపట్టలేదు. వరుస ఘటనలతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళుతున్నారు. మరోవైపు కస్తూర్బా ఘటనలో ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడంతోనే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చెబుతుండడం గమనార్హం. కాగా.. ఇదే విషయంపై జేసీ, జీసీడీఓను వివరణ కోరేందుకు ప్రయత్నించినప్పటికీ వారు అందుబాటులోకి రాలేదు.

ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థత

బండిఆత్మకూరు: ఫుడ్‌పాయిజన్‌తో స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బండిఆత్మకూరు కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు మంగళవారం రాత్రి కడుపునొప్పి, వాంతులతో చికిత్స కోసం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. విద్యార్థినుల కాళ్లు, చేతులు బిగుసుకుపోతుండటంతో 108లో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినులు కలుషిత ఆహారం తినటం వల్లే అనారోగ్యానికి గురయ్యారని, ప్రస్తుతం వారు ఆసుపత్రిలో కోలుకున్నారని వైద్యులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరపాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

వంట అధ్వానంగా చేస్తున్నారంట

బండి ఆత్మకూరు కస్తూర్బా పాఠశాలలో మా పాప మహాలక్ష్మి ఆరో తరగతి చదువుతోంది. ఈ మధ్య వంట అధ్వానంగా ఉంటోందని మాకు చెబుతోంది. మంగళవారం కూడా ప్రిన్సిపాల్ మాకు ఫోన్ చేసి మీ కుమార్తెకు అనారోగ్యం బాలేదని చెప్పడంతో తొమ్మిది గంటల సమయంలో ప్రభుత్వాస్పత్రికి వచ్చాం. చిన్న పిల్లల విషయంలో అధికారులు ఇలా వ్యవహరించడం బాగాలేదు. ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతమవకుండా చూడాలి.

– శ్రీనివాసులు, విద్యార్థిని తండ్రి, గాజులపల్లె

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

- పీడీ వెంకటసుబ్బయ్య



భీమునిపాడులో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య

కోవెలకుంట్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. బుధవారం భీమునిపాడులో స్వచ్ఛభారత్ షెడ్ ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం స్థానిక ఉపాధి పథక కార్యాలయంలో మండలంలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి ఆర్థిక సంవత్సరం ముగియనున్న దృష్ట్యా గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు చూపించాలన్నారు. వంద పనిదినాలకు దగ్గరలో ఉన్న కుటుంబాలకు అవగాహన కల్పించి ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి పూర్తయ్యేలా పనులు కల్పించాలని పేర్కొన్నారు. కూలీలకు సగటు వేతనం రూ. 300 అందేలా పనులు చూపించాలన్నారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న గోకులం షెడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, ఉపాధి పథక ఏపీఓ శ్రీవిద్య, ఈసీ హరికిషోర్, టెక్నికల్ అసిస్టెంట్లు జయభారత్‌రెడ్డి, పక్రుద్దీన్‌బాషా, రాధాదేవి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా శ్రీగిరి ప్రదక్షిణ

శ్రీశైల మహా క్షేత్రంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను వాహన రథంలో ఉంచి ప్రత్యేక పూజలు చేసి ఆలయ మహాద్వారం నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభించారు. క్షేత్ర పరిధిలోని ప్రాచీనమఠాలు, పురాతన ఆలయాలను భక్తులు దర్శించుకునేలా దేవస్థానం ఈ కార్యక్రమం చేపట్టింది.

– శ్రీశైలం టెంపుల్

15న 'స్వచ్ఛత'



మట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లో ఈనెల 15న స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తాగునీరు, పారిశుద్ధ్యం, స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ గ్రీన్ లీఫ్ రేటింగ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సంపద సృష్టించేలా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పైప్ లైన్ల మరమ్మతులు, రిపేర్లు ఏమైనా ఉంటే 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలన్నారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి కిచెన్ గార్డ్ ప్రమోట్ చేసేందుకు గుర్తించాలన్నారు.

కేసీ కెనాల్‌కు కృష్ణా జలాలు

పగిడ్యాల: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కేసీసీ లిఫ్ట్ నుంచి రెండు మోటార్లతో 490 క్యూసెక్కుల కృష్ణా జలాలను కేసీలోకి సరఫరా చేస్తున్నామని నీటిపారుదల శాఖ ఏఈఈ నరేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాలువకు నీటి సరఫరా నిలిచిపోయిన ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ముచ్చుమర్రి నుంచి రెండు రోజులుగా నీటి సరఫరాను కొనసాగిస్తున్నామని తెలిపారు. నదిలో నీటి లెవెల్స్ పడిపోయేదాకా నీటిని పంపింగ్ చేస్తామని, అవసరమైతే మరో మోటర్‌ను కూడా ఉపయోగిస్తామన్నారు.

టెండర్లలో టీడీపీ నేతల హవా!

- వాయిదా పడిన వాటికి మార్చి 4న వేలాలు



సీల్డు టెండర్లు తీస్తుండగా అధికారుల వెనుక నుంచి చూస్తున్న టీడీపీ నేతలు

మహానంది: దేవస్థాన పరిధిలోని డార్మెటరీ భవనంలో బుధవారం సీల్డు, బహిరంగ టెండర్లు నిర్వహించారు. టీడీపీ నేతల కనుసన్నల్లో అధికారులు నడుచుకోవడం పలు విమర్శలకు తావిచ్చింది. బహిరంగ వేలాల్లో పాల్గొనేందుకు పలువురు ఆసక్తి చూపినా టీడీపీ నేతల భయంతో ముందుకు రాలేదు. టోల్‌గేట్ల నిర్వహణ ద్వారా గతేడాది రూ. 1,71,22,535 వచ్చింది. ఈ ఏడాది రూ. 2కోట్లకు పైగా వస్తుందని ఆశించారు. టీడీపీ నేత ఒత్తిడి వల్ల ఎవరూ ముందుకు రాకపోగా ఒక్కరే డిపాజిట్ చెల్లించడంతో వాయిదా పడింది. భక్తుల పాదరక్షలు భద్రపరుచుకునేందుకు, మరుగుదొడ్ల నిర్వహణ, సంప్రదాయ దుస్తుల విక్రయాల టెండర్లు వాయిదా పడ్డాయి. పచ్చికొబ్బరి చిప్పల సేకరణకు మహానందికి చెందిన టి.నాగరాజు గత ఏడాది కంటే ఎక్కువగా రూ.14,51,051 సీల్డు టెండరు దాఖలు చేసినా ఇవ్వకపోవడంపై అధికారులపై ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం. టీడీపీ నేతలు అందరూ టెండర్ల వద్దే తిష్టవేయడంపై పలు విమర్శలు వచ్చాయి. హెచ్చు మొత్తం చూపిన వారికే సీల్డు టెండర్లను కట్టబెట్టారు. సీల్డు టెండర్లలో పాల్గొనడం ఇష్టం లేదని లేఖలు రాసివ్వాలని కొందరిపై టీడీపీ నేతలు ఒత్తిళ్లు చేశారు.



టెండర్లలో పాల్గొన్న నేతలు, స్థానికులు

- అభిషేక సామగ్రి విక్రయించుకునే విభాగాన్ని మహానందికి చెందిన మురళీకృష్ణ రూ. 60,00,100, నవగ్రహాల వద్ద దీపారాధన సామగ్రికి టి.నాగరాజు రూ. 43లక్షలు, సెల్‌పాయింట్, క్లోక్‌రూమ్ నిర్వహణకు శ్రీనగరం గ్రామానికి చెందిన నాగేంద్ర రూ. 21.96లక్షలు, తలనీలాల సేకరణను హిందూపురం పట్టణానికి చెందిన రాజు రూ. 7.80లక్షలతో దక్కించుకున్నారు. మిగిలిన వాటికి మార్చి 4న తిరిగి వేలాలు నిర్వహిస్తామని ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

రేషన్ మాఫియాపై ఉక్కుపాదం

- ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా



మాట్లాడుతున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశభవనంలో ఆయన నంద్యాల సబ్‌డివిజన్ పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా స్టేషన్లలో నమోదైన కేసుల స్థితిగతులు, అరెస్ట్, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల ఫైళ్లను పరిశీలించారు. జిల్లాలో రేషన్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. నేరం చేసిన నిందితులకు శిక్షపడేలా సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించాలని పేర్కొన్నారు. తప్పిపోయిన మహిళలు, బాల బాలికల కేసులను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోక్సో కేసుల్లో నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని ఆదేశించారు. రహదారులపై ప్రమాదాలు జరగకుండా బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సూచికలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చోరీలు, దారి దోపిడీల నియంత్రణ కోసం పోలీస్ బీట్ పెంచాలని సూచించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని గంజాయి, అక్రమ మద్యం రవాణ, గుట్కా తదితర వాటిపై దృష్టిఉంచాలని వివరించారు. నేరాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. డీఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్ , అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్‌బాబు, సబ్ డివిజన్ సీఐలు పాల్గొన్నారు.

ప్రమాద రహిత డ్రైవర్లకు అలవెన్సులు

- ఏపీఎస్‌ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్

కర్నూలు సిటీ: ప్రమాద రహిత ఆర్టీసీ డ్రైవర్లకు అలవెన్సులు అందజేస్తామని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఆర్టీసీ ట్రైనింగ్ కాలేజీలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను క్షేమంగా గమ్యం చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లదేనన్నారు. 45 ఏళ్లలోపు వయస్సు ఉన్న డ్రైవర్లు మూడేళ్లకు ఒకసారి, 45 ఏళ్లు పైబడిన వారు ఏడాదికి ఒకసారి తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆర్టీఓ భరత్ చవాన్ మాట్లాడుతూ రహదారి నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సదస్సులో ఆర్‌ఎం టి.శ్రీనివాసులు, కర్నూలు–1 డిపో మేనేజర్ సుధారాణి, ఆర్టీసీ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్, మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు రవీంద్ర కుమార్, ఎస్.నాగరాజా నాయక్, ఎంవీ సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ బాబు కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

'నీటిముంపు' డాక్యుమెంట్ల పరిశీలన



డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: శ్రీశైలం డ్యాం నిర్మాణం కోసం 44 ఏళ్ల క్రితం సర్వస్వం కోల్పోయి వీధిన పడిన బాధితులకు చెందిన 3,951 కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని 80 బన్నూరు, 35 బొల్లవరం, తాటిపాడు, ఘణపురం గ్రామాలకు చెందిన నీటిముంపు బాధితుల డాక్యుమెంట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తపల్లి, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, నందికొట్కూరు, కర్నూలు మండలాల పరిధిలో 4,853 కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉండగా అందులో ఇప్పటిదాకా 632 కేసులు లోక్‌అదాలత్ కోర్టులో పరిష్కారమయ్యాయన్నారు. ఇంకా 3,951 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. తాతలు, తండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీట్రీ ఆఫ్ అవార్డునెస్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఎన్‌ఓసీ ఆల్ ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్, సెల్ఫ్ అఫిడవిట్, ఆధార్, బ్యాంకుపుస్తకం, రెండు పాస్ ఫోటోలు, రేషన్‌కార్డు సమర్పిస్తే ..వారి వివరాలు పరిశీలించి కోర్టుద్వారా నష్టపరిహారం అందేలా చేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో ఘరానా మోసగాళ్లు?

కోవెలకుంట్ల: విదేశీ కరెన్సీ ఆశ చూపి ఇద్దరు అమాయకుల నుంచి రూ. 10 లక్షలు డబ్బులు కొట్టేసిన ఘరానా మోసగాళ్లను కోవెలకుంట్ల పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన సయ్యద్ మహబూబ్ బాషా, శ్రీనివాసులుకు గుర్తు తెలియని వ్యక్తులు రూ. 20 లక్షలు విలువ చేసే డాలర్లు ఇస్తామని చెప్పారు. వారిని కోవెలకుంట్లకు రప్పించి రూ. 10 లక్షల నగదు తీసుకుని ఉడాయించిన ఘటనపై ఈ నెల 8వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఘరానా మోసగాళ్లను పట్టుకునేందుకు సీఐ హనుమంతు నాయక్ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల, రేవనూరు ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు, తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ముఠాలో ఇంకా ఎవరైనా ఉన్నారా, ఇతర ప్రాంతాల్లో ఏవైనా సైబర్ నేరాలకు పాల్పడ్డారా, ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తులేమైనా ఉన్నారా అన్న కోణాల్లో పోలీసులు ఆరా తీసుకున్నారు. పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

నంద్యాలలో చైన్ స్నాచింగ్

బొమ్మలసత్రం: నంద్యాలలో ఆలయానికి వెళ్లి వస్తున్న ఓ మహిళ మెడలో తాళిబొట్టు గొలుసును ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి అపహరించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. డోన్‌కు చెందిన ఆదిలక్ష్మి నంద్యాలలోని జగజ్జననీ ఆలయ దర్శనానికి వచ్చింది. ఆలయంలో దర్శనానంతరం సమీపంలోని సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఉన్న బంధువుల ఇంటికి బయలుదేరింది. స్థానిక ఆత్మకూరు బస్టాండ్ సర్కిల్ వద్దకు రాగానే బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న 5 తులాల బంగారు తాళి గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితురాలు వెంటనే స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని నూనెపల్లి వీధిలో పేకాట ఆడుతున్న 9 మందిని త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణానికి చెందిన సురేష్‌కుమార్, అబ్దుల్ రషీద్, బాబుల్, వెంకటరమణ, రసూల్, వెంకట రామయ్య, శివశంకర్, వినోద్‌కుమార్, అన్వర్‌బాషాలు నూనెపల్లి సమీపంలోని మంచినీళ్లబావి వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అరెస్ట్ చేసి, రూ.40,825 నగదు, 9 సెల్‌ఫోన్‌లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మృతదేహం లభ్యం

బనగానపల్లె: పట్టణ సమీపంలోని కోవెలకుంట్ల రోడ్డులో ఎస్సార్‌బీసీ సబ్ కెనాల్‌లో బుధవారం జాకీర్‌హుస్సేన్(42) మృతదేహం లభ్యమైందని ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. నంద్యాలకు చెందిన జాకీర్‌హుస్సేన్ శ్రీనివాస సెంటర్‌లో జ్యూస్ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. పాణ్యం సమీపంలోని ఎస్ఆర్‌బీసీ కెనల్‌లో ప్రమాదవశాత్తూ పడి కొట్టుకుపోయి మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫైర్‌మన్ రాజ్‌కుమార్ సస్పెన్షన్

కర్నూలు: కర్నూలు అగ్నిమాపక కేంద్రంలో ఫైర్‌మన్‌గా పనిచేస్తున్న ముదిగేడు రాజ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. అగ్నిమాపక అధికారి కార్యాలయంలో ఏపీ ముఖ్యమంత్రి ఫొటోను ఉద్దేశపూర్వకంగా దొంగలించడం, సిక్ లీవ్‌లో ఉండి అతనికి ఏమాత్రం సంబంధం లేకపోయినా పత్తికొండ ఇన్‌చార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌కు ఫోన్ చేసి సిబ్బంది డ్యూటీ వివరాలను బెదిరింపు పూర్వకంగా అడిగి హెచ్చరించినందుకు రాజ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడినట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జయసింహ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కొంతకాలంగా సిక్ లీవ్‌లో ఉన్న రాజ్‌కుమార్.. అగ్నిమాపక అధికారి కార్యాలయంలోని పరిసర ప్రాంతాల చుట్టూ అనుమానాస్పదంగా తిరుగుతుండటం, అలాగే దురుసుగా ప్రవరిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు.

బాబోయ్.. బర్డ్‌ఫ్లూ!



- ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ.. లక్షల్లో కోళ్లు మృతి
- తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కోళ్లు, గుడ్ల రవాణా నిషేధం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధికారుల అప్రమత్తత
- ఆదోని డివిజన్‌లో 4, కర్నూలు మండలంలో ఒక చెక్‌పోస్టు ఏర్పాటు



ఆదోని మండలం పెద్దహరివాణం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

కర్నూలు(అగ్రికల్చర్): బర్డ్ ఫ్లూ భయపెడుతోంది. ప్రమాదకరమైన ఈ వ్యాధి తెలంగాణ, కర్ణాటకతోపాటు.. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కోళ్లకు వ్యాపించింది. ఫలితంగా ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణ తదితర జిల్లాల్లో లక్షల కోళ్లు మరణించాయి. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోనూ చికెన్ విక్రయాలు పడిపోయాయి. మరోవైపు పశు సంవర్ధక శాఖ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల పక్షి జాతికి చెందిన కోళ్లు, బాతులు, కంజులు, గుడ్లు జిల్లాలోకి రావాణా నిలిపేసేందుకు మంత్రాలయం మండలం మాధవరం, కౌతాలం మండలం బాపురం, ఆదోని మండలం పెద్దహరివాణం, హాలహర్వి మండలం చింతకుంట, కర్నూలు మండలం పంచలింగాల గ్రామాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు.

వ్యాధి వ్యాప్తి చెందే పక్షి జాతులు

బర్డ్‌ఫ్లూ వ్యాధి తెల్ల జాతి ఫారం కోళ్లల్లో, గిన్ని కోళ్లు, టర్కీ కోళ్లు, నీటి పక్షులు, బాతులు, కొంగలు, కౌజు పిట్టలు, వన్యపక్షులు, నెమళ్లు, విదేశీ పక్షుల ద్వారా కూడా వ్యాపించవచ్చు. ముక్కు, కళ్ల వెంబడి నీరు కారడం, మెడ వాల్చడం, నీరసంగా ఉండడం, కాళ్లు శరీర భాగాలపై మచ్చలు ఏర్పడటం, తలపై భాగంలో ఉండే వాటిల్స్ ఉబ్బడం, దానిపై మచ్చలు ఏర్పడటం, విరేచనాలు ఎక్కువ కావడం కోళ్లలో గమనించవచ్చు. లేయర్స్‌లో గుడ్ల శాతం ఒక్కసారిగా తగ్గిపోవడం జరుగుతుంది. ఈ వ్యాధి తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నప్పుడు 24-48 గంటల్లో ఎక్కువ శాతం కోళ్లు మరణిస్తాయని జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు తెలిపారు.

పౌల్ట్రీఫామ్ రైతులకు ముఖ్యసూచన

ఏదయినా వ్యాధిని పశువు లేదా పక్షి స్థాయిలోనే నియంత్రించ గలగాలి, అలా చేయలేనప్పుడు వ్యాధి వ్యాప్తిని, మనుషులకు సంక్రమించే ప్రమాదాన్ని నివారించలేం. అందువల్ల వ్యాధి గురించిన పూర్తి వివరాలు, వ్యాధి గురించిన సర్వయిలెన్స్ అంటే ఏదయినా ప్రాంతంలో వ్యాధి ఉన్నదీ, లేనిదీ, తేల్చి చెప్పే పరిస్థితి, వ్యాధి వచ్చినట్లు అనుమానమున్న వెంటనే అందరినీ వీలయినంత త్వరగా అప్రమత్తం చేసే వీలు, వ్యాధి నిర్ధారణ అయితే దానిని సమూలంగా అరికట్టటానికి పశువులను, పక్షులను రక్షించటానికి అనువయిన పరిస్థితులు ఉంటే వ్యాధి వ్యాప్తిని తేలికగా కూడా అరికట్టవచ్చని ఏడీ రవిబాబు పేర్కొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు



విజిలెన్స్ తనిఖీల్లో పట్టుబడిన గ్యాస్ సిలిండర్లు

కర్నూలు: స్థానిక పార్కు రోడ్డులో ఉన్న న్యూ షరాఫ్ కేఫ్ అండ్ బేకర్స్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న మసాలాలతో కూడిన వేరుశనగ పన్నీరు, ఉస్మానియా బిస్కెట్ల నాణ్యత ప్రమాణాల కోసం నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాదులోని ల్యాబ్‌కు పంపారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులను వాడుతున్నట్లు గుర్తించి, కేఫ్‌లో అపరిశుభ్ర వాతావరణంలో తినుబండారాలు ఉంచినట్లు గుర్తించి రూ.2 లక్షలు అపరాధ రుసుం విధించారు. గృహ అవసరాలకు వినియోగించాల్సిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడటంతో మూడు సిలిండర్లను సీజ్ చేసి హోటల్ నిర్వాహకునిపై ఈసీ యాక్ట్ 1955 కింద 6ఏ కేసు నమోదు చేసి గ్యాస్ సిలిండర్లను సదానందేశ్వర గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. తిరుబండారాల్లో కల్తీ జరిగినట్లు నిరూపణ అయితే తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

14న బుడగ జంగాల ప్రశ్నోత్తరాల సమీక్ష

కర్నూలు(అర్బన్): స్థానిక కలెక్టరేట్‌లోని పాదుపు భవనంలో ఈనెల 14న బేడ బుడగ జంగాల సమస్యలపై ప్రశ్నోత్తరాల సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు బేడ బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని బేడ బుడగ జంగాల రిజర్వేషన్ సమస్య కేంద్రం వరకు వెళ్లి వెనక్కి వచ్చిందన్నారు. అందుకు కారణాలు ఏమిటనేది విశ్లేషించుకుని, మరోసారి పకడ్బందీగా కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ప్రజాభ్యుదయ సంస్థ కార్యదర్శి భార్గవ్ హాజరవుతున్నారని, కుల పెద్దలు, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం

- మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మల్లెల వెంకటరావు



సంఘీభావం తెలుపుతున్న మాల జేఏసీ నేతలు

కర్నూలు (అర్బన్): ఎస్సీ ఉపవర్గీకరణకు సంబంధించి పాలక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తాము పోరాటం చేస్తున్నామని మాల మహాసభ, మాల జేఏసీ నేతలు అన్నారు. ఈనెల 23న కర్నూలులో జరగనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభను విజయవంతం చేసేందుకు మాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎస్వీ రెజెన్సీలో మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మల్లెల వెంకటరావు, జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు, గౌరవాధ్యక్షులు మాధవస్వామి, గోన నాగరాజు, వేల్పుల జ్యోతి తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పోరాటం మాదిగలకు వ్యతిరేకం కాదని, కేవలం ప్రభుత్వాలకు మాత్రమే వ్యతిరేకమన్నారు. ఎస్సీ వర్గీకరణ అనేది రాజ్యాంగబద్ధమైనది కాదన్నారు. దేశంలో ఎస్సీ ఉప కులాలు అనేకం ఉన్నాయని, తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే వర్గీకరణ చేయాలని ప్రభుత్వాలు చూడటం సరికాదన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ వడ్డెపల్లి మాధవస్వామి, నాయకులు శివశంకర్, కేదార్‌నాథ్, లక్ష్మయ్య, మాధవస్వామి, బండి సుధీర్, మాదాసు నాగరాజు, ప్రసాద్, బంగి స్వాములు, రవిరాజు, జాన్, శ్యామ్, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

16న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

కర్నూలు(అర్బన్): ఈనెల 16న ఉదయం 9 గంటల నుంచి తిరుపతి బైరాగిపట్టడ వైఖాసన కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకటరామరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం కూడా ఉంటుందన్నారు.

'సప్లిమెంటరీ'కి 55 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు బుధవారం 55 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ పరీక్ష 11, బీఈడీ పరీక్షలు 8 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. డిగ్రీ పరీక్షలకు 112 మందికి 73 మంది హాజరు కాగా 39 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్‌ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బీఈడీ పరీక్షలకు 73 మందికి 57 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న అనీషా, రోదిస్తున్న ఇద్దరు చిన్నారులు

ఆదోని రూరల్: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు నక్కల బుజ్జమ్మ, హనుమంతు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దతుంబళం గ్రామానికి చెందిన శాంతి రాజు, అదే గ్రామానికి చెందిన అనీషా(25) ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. కాగా కొన్ని రోజులుగా అనీషాను భర్త వేధించేవాడు. ఇటీవల వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పెద్దతుంబళం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా తల్లి మృతదేహం వద్ద చిన్నారులు రోదిస్తున్న తీరు చూసి పలువురు కంట తడిపెట్టారు.

ట్రెజరీల్లో అవినీతిపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ట్రెజరీల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ డైరెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. 'ట్రెజరీల్లో లంచావతారాలు' అనే శీర్షికపై ఈ నెల 6వ తేదీన 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని లోకాయుక్త సుమోటోగా తీసుకొని ఖజానా శాఖ డైరెక్టర్‌కు నోటీసులు ఇచ్చింది. దీనిపై ఖజానా శాఖ డైరెక్టర్ తీవ్రంగా స్పందించారు. కర్నూలు జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీల్లో లంచావతారాలు ఉన్నా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ జిల్లా ట్రెజరీ అధికారిపై మండిపడినట్లు తెలుస్తోంది. మూడు నెలలుగా జిల్లా ట్రెజరీ, కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ, నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని ట్రెజరీలకు వచ్చిన పెన్షన్ ప్రపోజల్స్, వాటిని ఎప్పటికి పరిష్కరించారు.. డీడీవోల నుంచి వచ్చిన బిల్లులను ఎప్పటిలోపు క్లియర్ చేశారనే దానిపై నివేదిక ఇవ్వాలని జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావును ఆదేశించినట్లు తెలుస్తోంది. కర్నూలు డివిజన్ సబ్‌ట్రెజరీలో అవినీతి డాన్‌గా గుర్తింపు పొందిన మహిళ ఉద్యోగిని జిల్లాట్రెజరీకి బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీల్లో అవినీతి ఎక్కువైందనే విమర్శలు రావడంతో వాటిపై ఖజానా శాఖ డైరెక్టర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన కుమ్మరి కేశాలు, గాయపడిన నిరంజన్

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట సమీపంలో కొచ్చెరువు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యారు. హైవే పోలీసులు తెలిపిన వివరాలు.. బుధవారం బేతంచెర్లకు చెందిన కుమ్మరి కేశాలు(48) హైవేలో కూలీలను తరలించేందుకు టాటా ఏస్ వాహనాన్ని తిప్పుతున్నాడు. సాయంత్రం పని సమయం కావడంతో కూలీలను ఎక్కించుకునేందుకు అదే వాహనంలో కేశాలుతోపాటు బిహార్‌కు చెందిన నిరంజన్ వస్తుండగా కర్నూలు వైపు వెళ్తున్న కర్ణాటకకు చెందిన ఓ కంటైనర్ ఢీకొనడంతో కేశాలు అక్కడికక్కడే మృతి చెందగా నిరంజన్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను తొలగించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాలకు తరలించారు. గాయపడిన నిరంజన్‌ను ఆసుపత్రికి తరలించారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన ప్రైవేట్ కళాశాలలు

జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్య ప్రవేశాల కోసం గత నెల 22న నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో ప్రైవేట్ కళాశాలలు సత్తా చాటాయి. అత్యధిక పర్సెంటైల్‌తో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు బుధవారం విద్యార్థులను అభినందించి ఫలితాల వివరాలను విలేకరులకు వెల్లడించారు.



విద్యార్థులతో నారాయణ విద్యా సంస్థల డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి, తదితరులు

అదరగొట్టిన 'నారాయణ' విద్యార్థులు

కర్నూలు సిటీ: జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. బుధవారం విద్యా సంస్థల డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి, డీన్స్ ఆంజనేయరెడ్డి, విశ్వనాథ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి జేఈఈ పరీక్షల్లో అత్యధిక పర్సెంటైల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి విడత జేఈఈ మెయిన్స్‌లో టి.మిథున్ సాయికుమార్ 99.91, కె.జీవన్‌కుమార్ 99.85, కె.చరణ్‌కుమార్ 99.84, ఎన్.శివ ధనుష్ 99.48, కె.సాయిశృతి 99.43, ఎం.డి ఖాజా ఫయోజున్ అహ్మద్ 99.43, కె.సాయి భాస్కర్ 99.21, డి.ధరణి 99.09, ఎన్.హర్షిత 98.87, ఎ.ఫణిశ్రీసాగంధ్ 98.81, కె.తన్మయిరెడ్డి 98.49, జె.ప్రణీత్‌కుమార్ 98.38, టి.రాహుల్ అరురూప్ 98.38, పి.దేవిశ్రీచరణ్ 98.24, ఆర్.యోగేష్ కుమార్ 98.01, షేక్.మహ్మద్‌జైద్ అహ్మద్ 97.76, ఎస్.సాయి మానస్‌గౌడ్ 97.69, ఎస్.ఖరాన్షు 97.54, డి.మధు చైతన్య రెడ్డి 97.53 పర్సెంటైల్ సాధించారన్నారు. అలాగే 99 పర్సెంటైల్‌పైన 8 మంది, 98కిపైగా 15, 97కు పైగా 19 మంది విద్యార్థులు, 96కుపైగా 25 మంది, 95కు పైగా 28 మంది, 90కిపైగా పర్సెంటైల్ 47 మంది విద్యార్థులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు వేణుగోపాల్ రెడ్డి, ఎన్.సారిక, విజయ మోహన్, పి.సుజాత పాల్గొన్నారు.

ఎస్ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు..



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జ్ టి.రఘువీర్

- తమ విద్యా సంస్థల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షల్లో అత్యధిక పర్సెంటైల్‌తో ప్రతిభ చూపారని నగర శివారులోని ఎస్.ఆర్ విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జ్ టి.రఘువీర్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాలలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలులో ఎస్ఆర్ విద్యా సంస్థలు ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే పేరెంట్స్ మంచి రెస్పాన్స్ వస్తుందన్నారు. ఇందుకు కారణం తమ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను జాతీయ స్థాయిలో ఏ పోటీ పరీక్షల్లోనైన ఇతరుల కంటే గొప్ప మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. జేఈఈ మెయిన్స్‌లో వెంపాడ కైలాష్ 97.53, ఒగ్గేటి హేమమహేందర 90.71, చెన్నకేశవ 86.79 పర్సెంటైల్ సాధించారన్నారు. మరి కొంత మంది విద్యార్థులు అత్యధిక పర్సెంటైల్ సాధించారన్నారు.



బి. కృష్ణశ్రీ | కె. జయశ్రీ | కె. పావని | ఎ. దేవాహర్షిని | బి. సంతోష్ కుమార్

అక్షరశ్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు..

ఆదోని సెంట్రల్: ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్‌లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు అక్షరశ్రీ జూనియర్ కళాశాల డైరెక్టర్ మేఘనాథ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ బి.కృష్ణశ్రీ 97.81, కె.జయశ్రీ 86.94, కె.పావని 84.63, ఎ. దేవా హర్షిని 81.23, బి.సంతోష్ కుమార్ 80.66 పర్సెంటైల్ సాధించార న్నారు. మంచి ఫలితాలను సాధించిన విద్యార్థుల ను, అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు.

న్యూక్లియస్ విద్యార్థులు..



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

నంద్యాల (న్యూటౌన్): జేఈఈ ఫలితాలను సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎస్ మురళీధర్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ వాసుదేవ రెడ్డి అభినందించారు. బుధవారం వారు మాట్లాడుతూ ఉత్తమ విద్య కోసం ఇక నుండి విద్యార్థుల తల్లిదండ్రులు వ్యయప్రయాసల కోర్చి దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం లేదని నంద్యాల న్యూక్లియస్ అకాడమీ ద్వారా సీనియర్ ఎన్ఈఈటీ / జేఈఈ ఫ్యాకల్టీ ని ఏర్పాటు చేసి ఉత్తమ శిక్షణను అందజేస్తున్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నారు. ప్రతి సంవత్సరం అత్యుత్తమ జాతీయ స్థాయి ర్యాంకులను సాధించడం న్యూక్లియస్‌కు సంప్రదాయం గా మారిందన్నారు. దూరప్రాంతాలలో ఉన్న విద్యాసంస్థలలో అధిక ఫీజు చెల్లించి చేరుతున్నారని, మన ప్రాంతంలో మిగిలిన కొద్దిమంది విద్యార్థులతోనే ఆశ్చర్య పోయే అత్యుత్తమ ఫలితాలను సాధించడం జరిగిందన్నారు.

ఎస్‌డీఆర్ విద్యార్థులు..



నరసింహ | గగన్ ప్రకాశ్

జేఈఈ మెయిన్ ఫలితాల్లో నంద్యాల ఎస్‌డీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు చైర్మన్ యస్.కొండా రెడ్డి తెలిపారు. నరసింహ 99.85, గగన్ ప్రకాశ్ 99.46, సుమిత్ర 98.33 పర్సెంటైల్ సాధించారన్నారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

తువ్వదొడ్డి విద్యార్థి..



అజిత్‌కుమార్‌రెడ్డి

డోన్ టౌన్/దేవనకొండ: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో దేవనకొండ మండలం తువ్వదొడ్డి గ్రామానికి చెందిన లక్కీరెడ్డి అజిత్ కుమార్‌రెడ్డి 98.99 పర్సెంటైల్ సాధించాడు. డోన్ నివాసం ఉన్న న్యాయవాది లక్కీరెడ్డి హనుమంతరెడ్డి రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు అజిత్‌కుమార్‌రెడ్డి 10వ తరగతి వరకు కర్నూలు నారాయణ విద్యా సంస్థల్లో పూర్తి చేసి, ఇంటర్ హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న నారాయణ కళాశాలలో చదివారు.

దేశ పురోగతికి అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తి

- సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు

కర్నూలు (అర్బన్): దేశ పురోగతికి అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తి అని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నగరంలోని శంకరాస్ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ ఆశయం - బహుజన భారతం అంశంపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తున్న వారిని అణచివేసి ఫాసిజం శక్తులు పెట్రేగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజన దళిత సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, రాజ్యాంగానికి సవరణలు చేస్తూ భారతదేశంలో విచ్ఛిన్న శక్తులు పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. దళితులపై, బహుజనులపై జరుగుతున్న అత్యాచారాలను ఆపే నాథుడు కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశ పరిస్థితులను చూస్తుంటే అణగారిన వర్గాలు మనుగడ సాగించే పరిస్థితి నానాటికీ దిగజారిపోతోందన్నారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొని అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనిఆయన కోరారు. సమావేశంలో పార్టీ రాయలసీమ జోన్ కోఆర్డినేటర్ సిద్ధపు పాండురంగ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు జయరాజు, సమాజ్‌వాది పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్, నాయకులు శేషఫణి, సింధు నాగేశ్వరరావు యాదవ్ పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలి

పత్తికొండ రూరల్: సూక్ష్మ, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని ఏపీఎఫ్‌పీ నోడల్ ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి కోరారు. బుధవారం పట్టణంలోని స్త్రీశక్తి భవన్‌లో ఏపీ ప్రాసెసింగ్ సొసైటీ లబ్ధిదారులు, మహిళా శక్తి సంఘాలు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో వాటిని అభివృద్ధి చేసేందుకు ఆర్థిక, సాంకేతిక శిక్షణ తోడ్పాటునందిస్తామని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లోని ఉత్పత్తులు టమాట, ఉల్లి, ఎండుమిరప, వరి, కందులు, మినుములు, జొన్నలు తదితర పంటల ద్వారా వచ్చే ప్రాథమిక ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం వల్ల రైతులకు, పరిశ్రమలు ఏర్పాటుచేసిన వారికి స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు. ఇందుకు 18 నుంచి 55సంవత్సరాల్లోపు వారు ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం పెట్టుబడి పెడితే 90 శాతం రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖ జేడీఏ వరలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణమూర్తి, పత్తికొండ ఏడీఏ విజయమోహన్, ఆదోని ఏడీ అగ్రికల్చర్ అధికారి బాలవర్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిని అడ్డుకున్న గ్రామస్తులు

- వరుస దాడులతో భయాందోళనలో ప్రజలు



రైతులతో కలిసి పహారా కాస్తున్న అటవీశాఖ సిబ్బంది

డోన్ టౌన్: మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలో చిరుత మంగళవారం రాత్రి జరిపిన దాడిని గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన బోయ హనుమంతు చీని తోటలో సోమవారం రాత్రి చిరుత రెండు పెంపుడు కుక్క పిల్లలను చంపి తిన్న విషయం పాఠకులకు విదితమే. తల్లి కుక్క, మరో మగ కుక్క పులిదాడి నుంచి తప్పించుకోగలిగాయి. ఈ విషయాన్ని గమనించిన రైతులు మంగళవారం రాత్రి బాధిత రైతు హనుమంతు, నేసె రమణయ్యతోపాటు మరికొంత మంది రైతులు చీని తోట వద్ద నిఘా వేచి ఉన్నారు. చిరుత అక్కడికి చేరుకోగానే పెద్ద కుక్కల అరుపులకు అప్రమత్తమైన రైతులు కేకలు వేయడంతో చిరుత పారిపోయింది. ఈ విషయమై ఫారెస్టు అధికారి ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన బీట్ ఆఫీసర్లను గ్రామానికి పంపి రాత్రి ఘటనా స్థలంలో రైతులతో కలిసి మంటలు వేసుకుని కాపలా కాసినట్లు తెలిపారు. చిరుతను బంధించి వేరే ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.